

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహాలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

### - 64 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'రావె చెలియా రావె రా నీ రాకతో నా బతుకు పడవ
ప్రేమలోకము చేరగా తెరచాప తెరిచి గట్టు విడిచె..'

నిరాడంబరమైన భాష, నిరుపమానమైన భావంతో చెవులకు విందుగా గానం వినిపిస్తున్నది. శ్రమను మరిచిపోవడం కోసం తనకోసం తానే పాడుకుంటున్నాడు నాగులు. కట్టలు కట్టలుగా నీలిమందు మొక్కలను నెత్తికెత్తుకుని తెస్తున్నారు కొందరు గ్రామీణ మహిళలు. ఆ మోపులను దించి కట్టలు విడదీసి నిలువెత్తున ఉన్న తొట్లలో నింపిన నీళ్ళలో వేస్తున్నారు కొందరు మగవాళ్ళు.

ఒక్కొక్క తొట్టి నాలుగు బారలు పొడవు, అంతే వెడల్పు ఉన్నది. అటువంటి తొట్లు రెండొందలు రెండొందలు లెక్కన మూడు భాగాలుగా ఆ రెండు ఎకరాల పొలంలో విభజించి వున్నాయి. కొన్నిటిలో కొత్తగా కట్టలు కట్టిన నీలి మొక్కలు వేసి ఒకరోజు మొత్తం నీళ్ళలో నానబెడతారు. కొన్నిటిలో బాగా నానిన నీలి మొక్కలు ముద్దలు ముద్దలుగా వుంటాయి. ఆ తొట్లలోకి దిగి నీలి రంగుకు తిరుగుతున్న నీళ్ళను పెద్ద పెద్ద తెడ్లు తీసుకుని బలంగా కొడతారు. అలా చిలకడం వలన మెత్తని రేకులు రేకులుగా నీలి మొక్కలు విడిపోతాయి. అది చాలా శ్రమతో కూడిన ప్రక్రియ. భుజాలు బండ రాళ్ళలాగా అయిపోతాయి.

క్రమంగా నానిన ఎండుగడ్డి రంగులోకి, ఆకుపచ్చ రంగులోకి దిగి, చివరకు నీలి రంగులోకి దిగేదాకా ఆ చిలకడం లాగా చేయడం సాగుతుంది. చివరకు గుజ్జుగా, నీలిరంగు ముద్దలుగా మారుతాయి నీలి మొక్కలు. ఆ నీలిముద్దలను అద్దకం కోసం సిద్ధంగా ఉన్న నేతవస్త్రాల బేళ్ళ వద్దకు బండ్ల మీద తరలిస్తారు.

జలాభిషేకం చేస్తున్న నల్లరాతి శిల్పంలా చమటలతో నిలువెల్లా ముద్ద అయిపోయి వగరుస్తూ ఆగిపోయాడు నాగులు. వంతుగా తాను అందుకొని తెడ్డుతో బలంగా చరుస్తున్నట్టు చిలకడం మొదలు బెట్టాడు నాగులుకు తోడుగా తొట్లో పనిలోకి దిగిన యువకుడు. చల్లని నీలి రంగు తుంపరలు చింది మీద పడుతుంటే మళ్ళీ అందుకున్నాడు నాగులు.

అతడి చూపు చిలిపిగా, కవ్వింపుగా ఉన్నది. రెండు వరుసల అవతల నీలికట్టలు దింపి, మొక్కలను విడదీసి తొట్టిలో వేస్తున్న పడుచు పిల్లపై వున్నది. చూపుకు పోటీగా చిలిపి నవ్వు మెరుస్తుంటే 'ఏంటి సంగతి' అన్నట్టు కనుబొమలు ఎగరేసి పాటను తీయగా  కొనసాగించాడు. చూపుకు చూపు, నవ్వుకు నవ్వు, సైగలకు సైగలతో సమాధానం చెబుతూ చెవులు పాట మీద, మనసు నాగులు మీద పారేసిందా పడుచు సింగారం. శరీరం మాత్రం యాంత్రికంగా నీలి మొక్కల కట్టలు దింపుకోవడం, విడదీసి తొట్టిలో వేయడం చేస్తున్నది.

'తెల్లనీ తెరచాప చుట్టూ కలయ జూస్తే నీటి నీలిమ
పుట్ట తేనెల పట్టు దాచి పక్కనే నీ కనుల నీలిమ
సొట్ట బుగ్గలదానా కొంచెం పైకి చూస్తే గగన నీలిమ
బిట్టులొలికే నీదు మోమును కప్పెనే నీ కురుల నీలిమ' ..

కవ్వింపుగా మత్తెక్కిన కన్నులతో పెదవులను గుండ్రంగా చుట్టి ఒక చిరు ముద్దును ముద్దుగా గాలిలోకి విసిరిందామె. నాగులు ఒళ్లంతా ఝల్లుమన్నది.

'లోకమంతా నీలమై నా లోకమంతా నీవుగా
లోకులంతా దూరమై నా నాకమంతా నీవుగా
సాగిపోదాం జోడుగుందాం వలపు తీరం చేరుకుందాం
వలపుటలల సడులు విందాం కమ్మ కమ్మని కలలు కందాం'

ఆమె కనులనుండి కురుస్తున్న మత్తులో తన సహచరుడు చేసిన సైగను గుర్తించలేదు నాగులు. లోగొంతుకతో అతను హెచ్చరించింది కూడా గమనించలేదు. 'ఇక నువ్వు అందుకో చిలకడం' అంటున్నాడేమో అతడు అనుకున్నాడు. ఛెళ్ళున కొరడా మోగిన ధ్వని వినిపించింది. నాగులు వీపు మీద చురకత్తితో కోసినట్టు ఎర్రని గాటు ప్రత్యక్షమైంది. చర్మం చిట్లి చిక్కని నెత్తురు బొట్లు బొట్లుగా చెమర్చింది. చుర్రుమన్న మంటను పంటి బిగువున అణుచుకుంటూ సర్రున త్రాచులా వెనక్కు తిరిగాడు.

'కలలు కంటావేం? కమ్మని కలలు?? లూస్టేలూస్ వార్కెన్' (సోమరిపోతు పంది) పని చెయ్యకుండా పడుచు ఇల్లలను చూస్తూ కూర్చుంటావా? కోమోవ్! ' అంటూ మళ్ళీ కొరడాను పైకెత్తాడు లూసిఫర్. పైకెత్తిన ఆ చేతిని ఎడమ చేతితో బలంగా బిగించి పట్టుకున్నాడు నాగులు. చుట్టుపక్కల హాహాకారాలు, ఆశ్చర్యంతో కూడిన కేకలు చెలరేగాయి. చేతిలోని తెడ్డును వదిలిపెట్టి ఆందోళనగా ముందుకు దూకాడు నాగులు సహచరుడు. కలవరపాటుతో వారిస్తూ నాగులు పట్టునుండి లూసిఫర్ చేతిని విడిపించే ప్రయత్నం చేశాడు.

'బీల్జిబబ్ ! బీల్జిబబ్!' అని పెద్దగా పిలుస్తూ నాగులు చేతులలో ఇరుక్కుపోయిన తన రెండు చేతులనూ విడిపించుకోవడానికి విశ్వప్రయత్నం చేశాడు లూసిఫర్. ఇనుప గుదియల లాగా వున్నాయి నాగులు చేతులు.

బరువు సరిపోవడం లేదని ప్రత్యేకంగా కోరి చేయించుకున్న మూడు మణుగుల తెడ్డుతో రోజంతా నీలి కట్టలను నుగ్గు నుగ్గు చేసే చేతులు అవి. అవమానంతో రోషంతో ఎర్రగా కందిపోయింది అసలే ఎర్రటి లూసిఫర్ ముఖం.

అటు పక్కన కొద్దిగా దూరంగా అద్దకం చేసి ఆరిపోయిన వస్త్రాల దొంతరల వద్ద ఉన్నాడు బీల్జిబబ్. వాటిని బళ్ళకు ఎత్తేవాళ్ళను ఆగకుండా పని చేయిస్తున్నాడు. అతడి చెవులకు సోకాయి లూసిఫర్ అరుపులు. విసురుగా తల తిప్పి పెనుగులాడుతున్న లూసిఫర్ అవస్థను గమనించాడు. గుమి గూడి వారించడానికి ప్రయత్నం చేస్తున్న వాళ్ళను చూశాడు. పరుగునా వచ్చి భుజానికున్న నాటు తుపాకీని నాగులు గుండెకి  గురిపెట్టి కఠినంగా హెచ్చరించాడు.

గడ గడ వణికిపోతూ రెండు చేతులూ జోడించి అతడి కాళ్ళమీద పడిపోయాడు ఒక వృద్ధుడు. జగన్నాధపురం నుండి నీలిమందు పనికి రోజూ నడిచి వచ్చే వృద్ధుడతడు. పనివాళ్ళ తరపున డచ్చి కంపెనీ వాళ్ళతో జీత భత్యాల గురించీ, పని కేటాయింపు, మంచీ చెడ్డా మాట్లాడే పెద్దమనిషి అతడు. చూపును, తుపాకీని పక్కకు తిప్పకుండా ఆ వృద్ధుడిని హెచ్చరించాడు బీల్జిబబ్. 'వదిలిపెట్టమని చెప్పు వాడికి. లేకుంటే కాల్చి పారేస్తాను'

ఆందోళనగా నాగులు భుజాలు పట్టుకుని బ్రతిమిలాడాడు ఆ వృద్ధుడు. నచ్చచెప్పాడు. ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దని కాళ్ళూ గడ్డం పట్టుకున్నాడు. కన్న ప్రాణం మరి. లూసిఫర్ వైపు, బీల్జిబబ్ వైపు మార్చి మార్చి అసహ్యంగా చూస్తూ వెనక్కు తగ్గాడు నాగులు. లూసిఫర్ చేతులు విడిచి పెట్టాడు. అంతే! లూసిఫర్ చేతిలో కొరడా నాగులు ఒంటిమీద నాట్యం చేయడం మొదలు పెట్టింది.

శక్తిని ధరించిన సుబ్రహ్మణ్యుడి శిల్పంలా తెడ్డు పట్టుకుని నిలబడిపోయాడు నాగులు. కొరడా దెబ్బ ఒక్కొక్కటి పడుతుంటే చిట్లిన చర్మం నుండి రక్తం బొట్లు బొట్లుగా చెమరుస్తున్నది. నిలువెల్లా పూచిన దిరిసెన చెట్టులా ఉన్నాడు. వృద్ధుడు బీల్జిబబ్ కాళ్ళు పట్టుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తూ బతిమిలాడు కుంటున్నాడు. క్రమ క్రమంగా ఆ రెండెకరాల ప్రదేశం, దాని పక్కనున్న అంతే విశాలమైన ప్రదేశం, దాని ప్రక్కనున్న ప్రదేశం అన్నిటికీ కార్చిచ్చులా పాకింది వార్త.

తలల మీద ఉన్న నీలిమొక్కల కట్టలు క్రింద పారేసి గావు కేకలు పెడుతూ పరుగున వచ్చారు ఆడవాళ్ళు. చేతులలో ఉన్న తెడ్లను పట్టుకుని కొందరు, మోస్తున్న పత్తి బేళ్ళను, అద్దకం పూర్తి అయ్యి ఆరబెట్టిన వస్త్రాల దొంతరలను కింద పారేసి కొందరు, ఆ ప్రదేశంలో ఉన్న మగవాళ్ళు అందరూ పరుగునా వచ్చారు. వార్త క్రమేపీ అనుకూలంగా ఉండే పనివాళ్ళు కూలీలు కొందరు పరుగునా వెళ్లి చెప్పడంతో డచ్చి అధికారులకు, ఉద్యోగులకు తెలిసింది. కొద్దిసేపటిలోనే డచ్చి స్థావరం అంతటా వార్త పాకింది.

ఇప్పుడు స్థావరానికి 'అప్పర్హుడ్'గా (ప్రధాన అధికారి) నికొలాస్ డాన్కర్ ఉడ్, 'సికందర్'గా (ఉప పాలనాధికారి) గేరార్డ్ బెనూర్డెన్ ఉన్నారు. ఇద్దరూ సమర్థులైన అధికారులే. కొద్దో గొప్పో మానవతా దృక్పథంతో ఉండే అధికారులే. దురదృష్ట వశాత్తూ యిద్దరూ స్థావరంలో లేరు. అందరూ ఉద్విగ్నంగా ఉన్నారు. ఉద్రిక్త పరిస్థితి ఏర్పడితే స్థావరంలో ఉన్న డచ్చి సైనికులను  నడిపించ గలిగిన సామర్థ్యం వారిద్దరికీ ఉన్నది. పరిస్థితులు చేజారిపోకుండా చక్కదిద్దగలిగే వ్యవహార దక్షులు ఆ యిద్దరు. సమయానికి వారు లేకపోవడంతో మిగిలిన డచ్చి ఉద్యోగులు, పనివాళ్ళు, మహిళలు, పిల్లలు భయపడసాగారు. వారి భయానికి పెద్ద కారణం ఉన్నది.

సరిగ్గా సంవత్సరమున్నర క్రితం, ఫాల్గుణ అమావాశ్య నాడు, తెల్లవారితే, మరునాడు ఉగాది (24-03-1686) గోల్కొండ సామ్రాజ్యానికి మకుటం లేని మహారాజులుగా గడిపిన అక్కన్న మాదన్నల తలలు గోల్కొండ నడివీధిలో నరకబడ్డాయి. డచ్చివారి వ్యాపారానికి, నాగులవంచ స్థావరానికి అండగా ఉన్న అక్కన్న మాదన్నల హత్యలతో డచ్చివారి నడుము విరిగినట్లయ్యింది. అక్కన్న మాదన్నల హత్యల తర్వాత వారి ఆశ్రితులు, బంధువులు, సమర్ధకులు కనీసం పదివేలమందిని చంపేశారు అన్నదమ్ములను అంతం చేసిన శత్రువులు. వేలాదిమంది స్త్రీలు మానభంగానికి గురైనారు. అక్కన్న మాదన్నల ఆశ్రితులుగా పేరుబడ్డ నాగులవంచ డచ్చి స్థావరంలోని అధికారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బ్రతికారు కొన్ని నెలలు.

గోల్కొండ సామ్రాజ్యంలో సంభవిస్తున్న మార్పుల సెగ నాగులవంచ డచ్చి స్తావరానికీ తగలడం మొదలైంది. అడపాదపా రైతులు, కూలీలు సణగడం, ఎదురు తిరగడం మొదలైంది. సముద్రాలు దాటి ఎక్కడినుండో వచ్చిన ఈ బేరగాళ్ళు మనమీద పెత్తనం చేయడం ఏమిటి? మన పంటభూములు, మన శ్రమ దోచుకుని వాడు బాగు పడుతుంటే, వాడికి బానిసలమై మనం బతుకులు ఈడ్చడం ఏమిటి అన్న అసంతృప్తి మెల్లగా మొదలైంది. దానికి తోడు కొందరు దుర్మార్గులైన డచ్చి ఉద్యోగులు, అధికారులు నిరంకుశంగా స్త్రీలను, పిల్లలను కూడా దుర్మార్గంగా దండించడం నాగులవంచ, చుట్టుపక్కల గ్రామస్థులను ఆవేశానికి గురిచేసి, చిన్న చిన్న ఘర్షణలు జరగడం మొదలైంది. స్థావరానికి రక్షణగా సైన్యాన్ని పెంచుకోవడానికి అనుమతి పొందడం సాధ్యం కావడం లేదు యిప్పుడు. ఆయుధాలు తుపాకీలు, మందుగుండు సామాగ్రి నిలువలను పెంచుకోవడానికీ అనుమతి దొరకడం లేదు. బింకంగా, పై పై గాంభీర్యంతో నెట్టుకొస్తున్నారు లౌక్యం తెలిసిన పై అధికారులిద్దరూ.

ఖచ్చితంగా నాలుగు రోజుల క్రితం (03-10-1687) గోల్కొండ ఔరంగజేబు వశమైంది. మొగలు సర్దారులు గోల్కొండ వీధులలో స్వైర విహారం చేశారు. కోట్ల సంపద, బంగారం, వజ్రాలు, వైడూర్యాలు, జాతి రత్నాలు రోజుల తరబడి దోచుకున్నారు. కోఠీలు, భవంతులు అగ్నికి ఆహుతి అయినాయి. దోచుకున్నంత దోచుకోగా ఔరంగజేబుకు లెక్క కట్టి అప్పజెప్పిన సంపద విలువ ఆఱుకోట్ల ఎనభై యైదు లక్షల హొన్నులు, రెండుకోట్ల యాభైమూడువేల రూపాయలు, నూటపదిహేను కోట్ల పదమూడులక్షల దమ్ములు. ఇవిగాక బంగారు, వెండి పాత్రలు, నగిషీవస్తువులు ఎన్ని అన్నది లెక్కకు అందని సంపద!

స్థావరం ప్రధానాధికారి ఐదువందలమంది సైనికులను వెంటబెట్టుకుని వెళ్ళాడు. యాభై బండ్లకు విలువైన ఆభరణాలు, పరిమళ ద్రవ్యాలు, నాణ్యమైన వస్త్రాలు, మామిడిపండ్లను ఎత్తించి గోల్కొండకు తీసుకుని వెళ్ళాడు. ముందు ఔరంగజేబు కుమారుడు మహమ్మద్ ఆజం దర్శనం చేసుకుని ఆయనకు కానుకలు సమర్పించుకోవాలి. ఆ తరువాత ఆయన చొరవతో పాదుషా దర్శనం చేసుకుని కానుకలు సమర్పించి సాగిలబడాలి. నాగులవంచలో డచ్చి వారి స్థావరాన్ని కొనసాగించడానికి అనుమతిని అభ్యర్థించాలి. తమరి రక్షణలో మాకు క్షేమం, లాభం కలగాలని ప్రార్థించాలి. ఎన్ని రోజులు పడుతుందో తెలియదు.

సికందర్ మచిలీపట్నం వెళ్ళాడు. రక్షణగా ఐదువందలమంది సాయుధులైన సైనికులను వెంట తీసుకుని వెళ్ళాడు. యాభై బండ్లమీద అద్దకం పూర్తి చేసిన నాణ్యమైన నాగులవంచ నేత వస్త్రాలు తీసుకుని వెళ్ళాడు. మచిలీపట్నం రేవులో ఓడను దొరికించుకుని వస్త్రాలను తమ దేశానికి పంపాలి. గత మూడు నెలలలో మొదటి విడత సరుకు రవాణా ఇది.

పై అధికారులిద్దరూ లేనప్పుడు డచ్చివారి స్థావరానికి ముగ్గురు అధికారులు బాధ్యులుగా ఉంటారు. వారిలో ఒకడు చాలా సాత్వికుడు, సహృదయుడు, మానవత్వం మూర్తీభవించినవాడు, అతడే అంబ్రాస్! మిగిలిన ఇద్దరు యిప్పుడు ఈ ఉద్రిక్త పరిస్థితికి కారణమైన అధికారులు లూసిఫర్, బీల్జిబబ్. గోల్కొండకు, మచిలీపట్నానికి వెళ్ళిన వేయిమంది సైనికులు పోగా యిప్పుడు స్థావరంలో వేయిమంది సైనికులు ఉన్నారు. దావానలంలా ఈ ఉద్రిక్త పరిస్థితి వార్త తెలియగానే రెండువందలమంది సైనికులు తుపాకీలు పట్టుకుని అక్కడికి పరుగులు పెట్టారు.

మిగిలినవాళ్ళు కొంతమంది కార్యాలయానికి రక్షణగా చుట్టూ ముట్టారు. కొంత మంది కోటలో ఉన్న అధికారుల, సామాన్య డచ్చి పౌరుల కుటుంబాలకు రక్షణగా లోపలా, బయటా మోహరించారు. మిగిలిన వాళ్ళు ఆయుధాలు, మందుగుండు ఉన్న గిడ్డంగుల చుట్టూ రక్షణగా నిలబడ్డారు.

ఘర్షణా స్థలానికి చేరుకున్న సైనికులు నివ్వెర పోయారు. ఏం చేయాలో అర్థం కాని స్థితిలో తడబాటుకు గురైనారు.  అప్పటికే పది పన్నెండేళ్ళ పిల్లలతో కలిపి, స్త్రీ పురుషులు వేయి మంది రైతులు, కూలీలు పోగయ్యారు అక్కడ. వారిని దాటి ముందుకు వెళ్ళడానికే వీలు లేకుండా కోపంతో, బాధతో, ఊగిపోతున్నారు.

వాళ్ళ మధ్య లోపల తమ అధికారులిద్దరు ఉండిపోయారు. లోపల ఏం జరుగుతున్నదో స్పష్టంగా తెలియడం లేదు వారికి. మూడవ అధికారి ముత్తవరం తిరునాళ్ళలో నాగులవంచ అద్దకం వస్త్రాల అంగడిని పెట్టడానికి కొంతమంది సైనికులను, రెండుబండ్ల నిండా నాణ్యమైన వస్త్రాలను తీసుకుని వెళ్ళాడు.

దెబ్బమీద దెబ్బగా కొరడాకు పని చెప్పి ఇక చేతులు పైకి లేపలేని స్థితికి వచ్చి ఆగిపోయాడు లూసిఫర్. అంగరఖా, అంగవస్త్రం, కిందపడిన తలపాగా అన్నీ రక్తసిక్తమై పోయినా కుంకుమ పూసిన శిలలా అలాగే నిలబడి ఉన్నాడు నాగులు. అతడి తండ్రి ప్రాధేయ పడీ పడీ, దుఃఖంతో శోష వచ్చి పడిపోయాడు. అతడి వలపుల పడుచు పిల్ల ఎవరి దగ్గర లాక్కుందో చేతిలో తెడ్డుతో ముందుకు ఉరకడానికి పెనుగులాడుతున్నది.

ఆమెను బలంగా పట్టుకుని అతి కష్టంగా ఆపుతున్నారు నలుగురు స్త్రీలు. నాగులు కూడా నేలమీదకు కుప్ప కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లున్నాడు. అతడి కనులు ఒంటిమీది నెత్తురు కన్నా ఎర్రగా వెలుగుతున్నాయి.

ఆగిపోయినవాడు ఒక్కసారి తల ఎత్తి చుట్టూ చూసి గుండె గుభిల్లుమని నివ్వెరపోయాడు లూసిఫర్. చుట్టూ గుమికూడిన వాళ్ళు కనీసం వేయిమంది ఉంటారు. ఆగ్రహంతో, ఆవేశంతో ఊగిపోతున్నారు కొందరు. ఆవేదనతో కదిలిపోతున్నారు కొందరు. శాపనార్థాలు పెడుతున్నారు కొందరు. బ్రతిమిలాడుతున్నారు కొందరు. ఆ వేయిమందిలో ఒక్కడు ముందుకు ఉరికినా మిగిలినవాళ్ళు ఆగరు అని అనుకోగానే గుండె ఆగిపోయినట్లు అయ్యింది అతడికి. ఒకే ఒక్క రెప్పపాటు కాలం తను కూడా లూసిఫర్ చూస్తున్నవైపే చూశాడు బీల్జిబబ్. అంతే!

ఏమైందో అర్థం కాకముందే నాగులు చేతిలో తెడ్డు దెబ్బకు బీల్జిబబ్ మణికట్టు విరిగిపోయింది. నేల మీద పడిన నాటు తుపాకీ నాగులవంచ మొత్తం మారుమోగేలా భయంకరమైన ధ్వనితో పేలింది. మట్టి ధూళి విరజిమ్మింది.

గొల్లున అరుస్తూ బీల్జిబబ్ మీదకు ఉరికారు నలుగురు యువకులు. లూసిఫర్ మెడను బలంగా పట్టుకుని బోర్లా పడేశాడు నాగులు. మెడ మీద ఇనుప స్థంభంలా కాలును అదిమిపెట్టి, అతడి రెండు చేతులూ బలంగా వెనక్కు విరిచి పట్టుకున్నాడు. ఎండు పుల్లలు గలగల లాడినట్లు కట కట ధ్వనులు  చేశాయి అతడి ఎముకలు. ఆవేశంతో, అంతవరకూ అదిమిపెట్టి భరించిన బాధతో, ప్రతీకారంతో నాగులు అరిచిన అరుపుకు పదిహేను మైళ్ళ దూరంలో స్థంభాద్రి కొండ సంతోషంతో ప్రతిధ్వనించిందా అనిపించింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS